నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 30 ఆగస్టు 2024 | HYDERABAD

నీటి సరఫరా బంద్

సిటీబ్యూరో, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ) : జలమండలి ఓఅండ్ఎం డివిజన్ -2 బాలాపూర్ రిజర్వాయర్ పరిధిలోని గుర్రం చెరువు నుంచి సన్నీ గార్డెన్స్ వరకు ఎస్ఎన్‌డీపీ డ్రైయిన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. బాక్స్ డ్రైయిన్ నిర్మాణానికి ఇబ్బందులు కలుగకుండా బాలాపూర్ రిజర్వాయర్ ఔట్‌లెట్ 450 ఎంఎం డయా పైపులైన్ డైవర్షన్ పనులు చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ పనులు శుక్రవారం (నేడు) సాయంత్రం 9 గంటల నుంచి మరుసటి రోజు శనివారం (రేపు) రాత్రి 8 గంటల వరకు జరుగుతాయని చెప్పారు. ఈ కారణంగా పలు ప్రాంతాల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. రాజా నరసింహ కాలనీ, ఇందిరానగర్, పిసల్‌బండా, దర్గా బురాన్షాహి, గాజీ-మిల్లత్, జీఎం చౌని, లలితాబాగ్, ఉప్పుగూడ, డీఎంఆర్ఎల్, డీఆర్‌డీఎల్, గారిసన్ ఇంజినీర్ -1, 2, డీఆర్‌డీవో మిధాని, ఒవైసీ హాస్పిటల్, బీడీఎల్, సీఆర్‌పీఎఫ్ కేంద్రీయ విద్యాలయ, హస్సాబాద్, ఖలందానగర్, సంతోష్‌నగర్ పాత కాలనీ, న్యూ కాలనీ, యాదగిరి కమాన్ ఎదురుగా ఉన్న ప్రాంతం, ఎంఐజీహెచ్, హెచ్ఐజీహెచ్, ఎల్ఐజీహెచ్ కాలనీలు, ఫహబా మసీదు, మారుతీనగర్, పోచమ్మ గడ్డ, హనుమాన్ టైలర్ గల్లీ తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని, ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకొని సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

వాహనాలను పరిశీలిస్తున్న ఆర్టీఏ అధికారులు

వీకెండ్ హైడ్రామా ఎక్కడ?

నోటీసుల జారీలో | ద్వంద్వ వైఖరి

సిటీ నలుదిక్కులా కమిషనర్ పర్యటన

ఈ వీకెండ్‌లో హైడ్రా బుల్డోజర్లు ఎటూ వైపు వెళ్తాయి.. ప్రస్తుతం నగరవాసుల్లో నెలకొన్న ఉత్కంఠ ఇది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఫిర్యాదులు అందగానే.. ఆయా ఏరియాల్లో చెరువులు, నాలాలు కబ్జా చేసి నిర్మించిన కట్టడాలను పరిశీలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ శనివారం 'హైడ్రా' ఎక్కడ ముహూర్తం పెట్టింది..? ఏ అక్రమ కట్టడం నేలకూలనున్నది అనేది చర్చనీయాంశంగా మారింది.

-సిటీబ్యూరో, ఆగస్టు 29 (నమస్తే తెలంగాణ)/ మియాపూర్/దుండిగల్



గత వారం వరకు హైడ్రా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా శని, ఆదివారాల్లో తెల్లవారుజాము నుంచే తమ ఆపరేషన్‌ను ప్రారంభించి గంటల వ్యవధిలోనే ముగించింది. కబ్జాదారులు కోర్టులకు వెళ్లకుండా ఉండేలా పకడ్బందీగా హైడ్రా తమ ప్రణాళికలను అమలు చేస్తూ వెళ్లింది. ఇంతలో ఓల్డ్‌సిటీలో మల్కం చెరువులో ఎంఐఎం నేతలు నిర్మించిన ఫాతిమా విద్యా సంస్థలను కూల్చాలంటూ ఫిర్యాదులు రావడం, సోషల్‌మీడియాలో తీవ్ర చర్చకు దారి తీయడంతో అక్బరుద్దీన్ ఓవైసీ ప్రభుత్వానికి వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో వెనక్కి తగ్గిన హైడ్రా ఇరిగేషన్, రెవెన్యూ శాఖల నుంచి ఆయా ప్రాంతాల్లో కబ్జా చేసి నిర్మించిన కట్టడాల యజమానులకు నోటీసులు జారీ చేయడం ప్రారంభించింది. ఈ నోటీసుల్లో కొందరికి ఆరు నెలల సమయం, మరికొందరికి నెల రోజులు, ఇంకొందరికి 7 రోజుల సమయం అంటూ ఆయా శాఖలు ఇస్తున్న సమయాన్ని చూసి.. ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. కబ్జా చేసిన వాళ్లందరినీ ఒకేలా చూడాల్సిన హైడ్రా..అధికార పార్టీతో పాటు ఆ పార్టీకి అడుగులకు మడుగులొత్తే వారికి మాత్రం ఒక రకంగా, ఇతరులను మరో రకంగా చూస్తూ ద్వంద్వ నీతిని ప్రదర్శిస్తున్నదంటూ.. ఆరోపిస్తున్నారు. హైడ్రా ఇస్తున్న నోటీసులతో కొందరు కోర్టులకు వెళ్లి స్టేలు తెచ్చుకుంటున్నారు. కోర్టుల నుంచి స్టేలు తెచ్చుకుంటారనే ఉద్దేశ్యంతోనే శని, ఆది వారాలతో పాటు సెలవు దినాల్లోనే హైడ్రా కూల్చివేతలు నిర్వహిస్తూ వస్తున్నది. ఈ శని, ఆదివారాల్లో హైడ్రా బుల్డోజర్లను ఎక్కడ దింపుతుందనేదానిపై నగర వాసులు ఎదురు చూస్తున్నారు.

సామాన్యులను భయపెట్టిస్తున్న హైడ్రా..

ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, ప్రభుత్వ భూముల్లో అనధికారికంగా నిర్మించిన కట్టడాలను కూల్చేస్తామంటూ హైడ్రా నెల రోజులుగా హంగామా చేస్తూ 18 నిర్మాణాలను కూల్చి 43 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించింది. హైడ్రా చేస్తున్న హైడ్రామాలతో నాలాలు, చెరువుల సమీపంలో కొన్నేళ్లుగా నివాసాలుంటున్న సామాన్య ప్రజలు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారు. సర్వే నంబర్ ఒకటేసి, పొజిషన్ మరో ప్రాంతంలో ఉండి కొందరు అనుమతులు పొంది భవనాలు నిర్మించారు. అలాంటి వాటికి రుణాలు సైతం బ్యాంకులు ఇచ్చాయి.. రిజిస్ట్రేషన్లూ అయ్యాయి. అన్ని సక్రమంగానే ఉన్నాయని లీగల్ ఓపినియన్ సైతం తీసుకొని చాలా మంది ఫ్లాట్లు, ఇండ్లు కొనుగోలు చేసిన వారున్నారు. అలాంటి వారు ఇప్పుడు తీవ్ర మానసిక ఆందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు బుల్డోజర్లు ఇండ్లపైకి వస్తాయా? అని భయపడుతున్నారు.

హైడ్రా పేరు చెప్పుకుంటూ..

హైడ్రా పేరు చెప్పుకుంటూ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. అయితే ఇదే అదనుగా కొందరు అధికారులు నోటీసుల పేరుతో వ్యాపారులు, సామాన్య ప్రజలు భయాందోళనకు గురిచేస్తున్నారు. 'నోటీసులు ఇచ్చాం.. ఇక కూల్చేస్తాం'అంటూ బెదిరిస్తున్నారు. ఏదో ఒకటి చేసి ఆపండంటూ ఆఫర్లు వస్తుండడంతో ఆయా అధికారులు బేరాలకు దిగుతున్నారు.

సీఎం సోదరుడి ఇంటి వద్ద హైడ్రామా..

దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్‌లో అమర్ సొసైటీ ఉందంటూ.. అక్కడ 200కుపైగా ఇండ్లకు ఇరిగేషన్ విభాగం నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న వారిలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి సైతం ఉన్నారు. ఈ సందర్భంగా మీడియా ఆయనను నోటీసులపై స్పందించాలని కోరింది. అయితే ఆయన అనుచరులు మీడియాపై దాడికి ప్రయత్నించారు. కొందరు మీడియా ప్రతినిధుల చేతిలో నుంచి లోగోలు లాక్కొనేందుకు యత్నించారు.

నిజాంపేట్ కమిషనర్ బదిలీ

నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు బదిలీ అయ్యారు. ఆయనను నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్‌గా సర్కారు బదిలీ చేసింది. ఇటీవల హైడ్రా బాచుపల్లి మండలం ఎర్రకుంట చెరువులో నిర్మించిన మూడు అపార్ట్‌మెంట్లను కూల్చివేసింది. అయితే చెరువులో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా.. చూసీచూడనట్లు వదిలివేశారనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో కమిషనర్‌తో పాటు బాచుపల్లి తహసీల్దార్ పూల్‌సింగ్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలోనే రామకృష్ణారావు బదిలీకావడం చర్చనీయాంశమైంది. రామకృష్ణారావు స్థానంలో యూజీడీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎంపీడీవో ర్యాంకు అధికారి సౌజన్యను ప్రభుత్వం కమిషనర్‌గా నియమించింది.

నోటీసులు అందుకున్న వారిలో ఆందోళన.. కబ్జాదారులకు సహకరించిన అధికారులపై కేసులు

ఐటీ అడ్డాలో 'హైడ్రా' గుబులు

చెరువులు, కుంటలు, పార్కులు ప్రభుత్వ స్థలాల పరిరక్షణే ధ్యేయంగా హైడ్రా బుల్డోజర్లతో దూసుకుపోతున్నది. ప్రధానంగా చెరువు ఎఫ్‌టీఎల్ బఫర్ జోన్లలో ఉన్న అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తుండటంతో ఐటీ అడ్డా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో అక్రమ నిర్మాణదారులకు చెమటలు పడుతున్నాయి. నియోజకవర్గంలోనే అతి పెద్దదైన దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో పెద్ద సంఖ్యలో భారీ భవనాలు నిర్మాణాలు జరగ్గా...వాటికి ఈ నెల రెండో వారంలో అధికారులు నోటీసులు జారీ చేశారు. సీఎం సోదరుడు సహా సినీ రాజకీయ ప్రముఖుల నివాసాలతో పాటు వ్యాపార వేత్తలవే వాటిల్లో సింహభాగం ఉన్నాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో ఎఫ్‌టీఎల్ పరిధిలోని నిర్మాణాలను కూల్చివేసిన నేపథ్యంలో దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని వాటిపైనా త్వరలోనే చర్యలుంటాయన్న ఊహాగానాలు నెలకొన్నాయి. దుర్గం చెరువుతో పాటు గంగారం పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనూ పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలను గుర్తించి..నోటీసులు జారీ చేశారు. వీటిని సైతం త్వరలో నేలమట్టం చేయనున్నారు.

సర్కారు స్థలాల పరిరక్షణకు.. ల్యాండ్ బ్యాంక్

నగరంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలపై జిల్లా రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. జిల్లాలో ఆక్రమణకు గురైన భూమి ఎంత? కోర్టు కేసుల్లో ఎంత స్థలం వివాదంలో ఉంది? తదితర వివరాలను మండలాల వారీగా లెక్కలు తీస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే ఎమ్మార్వోలకు హైదరాబాద్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు ప్రత్యేకంగా ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసి.. వెబ్‌సైట్‌ను రూపొందిస్తున్నారు. అంతేకాదు మండలాల వారీగా భూ లెక్కలను పరిశీలించేందుకు డిప్యూటీ కలెక్టర్లకు కలెక్టర్ బాధ్యతలు అప్పగించారు. హైదరాబాద్‌లో 16 మండలాలు ఉన్నాయి. వాటి పరిధిలో సుమారు 1075 ల్యాండ్ పార్సిల్స్ ఉన్నట్లు గత రెవెన్యూ గణాంకాలు చెబుతున్నాయి. అందులో 890 ల్యాండ్ పార్సిల్స్‌లో ఎలాంటి వివాదాలు లేకుండా 40,66,914.08 చదరపు గజాల విస్తీర్ణ స్థలం ఖాళీగా ఉంది. మిగతా పార్సిల్స్‌లో సుమారు 11, 45,334.95 చదరపు గజాల విస్తీర్ణం గల ఖాళీ స్థలం ఆక్రమణలో ఉన్నట్టు ఓ అధికారి తెలిపారు. సుమారు 169 పార్సిల్స్‌లో 445098.64 చదరపు గజాల ఆక్రమిత భూమి కోర్టు కేసుల్లో ఉన్నట్లు రెవెన్యూ రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. కోర్టుల్లో ఏండ్ల తరబడి వివాదాస్పదంగా ఉన్న భూములను త్వరితగతిన కొలిక్కి తీసుకొచ్చేందుకు కలెక్టర్ ప్రత్యేకంగా లా ఆఫీసర్స్‌తో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

వాహనాలు.. కాలుష్య వాహకాలు

నగరంలో సుమారు 80 లక్షలకు పైగా వెహికిల్స్

రోజుకు 1500 టన్నుల కాలుష్యకారకాలు విడుదల

కాలుష్యం కట్టడికి ఆర్టీఏ కఠిన చర్యలు

నిబంధనలకు విరుద్ధంగా రోడ్డెక్కుతున్న వాహనాలపై నజర్

సిటీబ్యూరో: పరిశ్రమల నుంచి విడుదలయ్యే ఉద్గారాలు ఓ వైపు.. వాహనాల నుంచి వెలువడే కాలుష్యం మరోవైపు... వెరసి గ్రేటర్‌లో పొల్యూషన్ పరిమితికి మించి పెరిగిపోతున్నది. ఈ నేపథ్యంలో ఆర్టీఏ అధికారులు కాలుష్యాన్ని కట్టడి చేసేందుకు నడుంబిగించారు. పొల్యూషన్ వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. గ్రేటర్‌లో సుమారు 80 లక్షలకు పైన వాహనాలు ఉన్నాయి. వాటి నుంచి రోజుకు 1500 టన్నులకు పైగా కాలుష్యకారకాలు విడుదలవుతున్నాయని ఆర్టీఏ అధికారులు చెబుతున్నారు.

కఠిన చర్యలకు ప్రణాళికలు..

వాహనాల కాలుష్య తనిఖీలు ఇక మీదట పకడ్బందీగా జరగనున్నాయి. పాత వాహనాలతో రోడ్లెక్కుతున్న వారిపై ఆర్టీఏ అధికారులు కఠిన చర్యలు తీసుకోనున్నారు. అందులో భాగంగానే పొల్యూషన్ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు ప్రైవేటు సంస్థలు వాహనాల కాలుష్య తనిఖీలు చేసి సర్టిఫికెట్స్ జారీ చేస్తున్నాయి. అయితే వారిచ్చే రీడింగ్స్ వివరాలు ఎంత వరకు సరైనవోననే అనుమానాలు కొంతమందిలో ఉన్నాయి. ఈ వివరాలు అన్నీ సెంట్రల్ సర్వర్‌లో అప్‌లోడ్ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. తాజాగా పొల్యూషన్ తనిఖీల్లో ఇటీవల 25 ద్విచక్ర వాహనాలను, 14 ఫోర్‌వీలర్స్‌ను ఆర్టీఏ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. స్కూల్‌జోన్లలో ప్రత్యేకంగా తనిఖీలు చేపడుతూ పొగలు చిమ్ముతున్న వాహనాలను ఆర్టీఏ అధికారులు సీజ్ చేస్తున్నారు.

బెడ్లు ఖాళీ లేవు..

జ్వరపీడితులతో కిక్కిరిసిన గ్రేటర్ ఆస్పత్రులు

రెండు నెలల్లో 714 డెంగీ కేసులు

సిటీబ్యూరో: 'వైద్యశాలల్లో బెడ్స్ ఖాళీ లేవు'... ఇది సర్కార్ దవాఖానా సిబ్బంది చెబుతున్న మాటకాదు.. ప్రైవేటు వైద్యశాలల్లోనూ ఇదే మాట వినిపిస్తున్నది. సీజనల్ జ్వరాలతో సర్కార్ దవాఖానలే కాకుండా ప్రైవేటు వైద్యశాలలు సైతం రోగులతో కిక్కిరిసిపోతున్నాయి. ఏ ఇంట్లో చూసినా జ్వర పీడితులు, డెంగీ బాధితులే ఉండటంతో ఆస్పత్రులన్నీ కిటకిటలాడుతున్నాయి. రోగుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుండడంతో ప్రైవేటులోనూ బెడ్లు దొరకడం లేదు. దీంతో మళ్లీ కరోనా నాటి పరిస్థితులు తలపిస్తున్నాయి. ఎక్కువగా వైరల్ ఫీవర్, డెంగీ కేసులే వస్తున్నట్లు ప్రైవేటు దవాఖానల వైద్యులు చెబుతున్నారు.

విజృంభిస్తున్న డెంగీ

నల్లకుంట ఫీవర్ హాస్పిటల్ సైతం వైరల్, డెంగీ రోగులతో నిండిపోయింది. మొన్నటి వరకు 500నుంచి 800వరకు ఉన్న రోజువారీ ఓపీ ప్రస్తుతం వెయ్యి దాటుతోందంటే పరిస్థితి ఎలా ఉందో అంచనా వేసుకోవచ్చు. జూలై, ఆగస్టు నెలల్లోనే ఇప్పటి వరకు 714 డెంగీ కేసులు నమోదైనట్లు అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తున్నది.

నోరు తెరిస్తే.. తిట్లే!

చర్చనీయాంశంగా ఓ జోన్ డీసీపీ వ్యవహారం

సిటీబ్యూరో: ఓ జోన్ డీసీపీ తిట్ల పురాణం పోలీస్‌శాఖలో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. సదరు అధికారి.. నోటి దురుసుతో సిబ్బంది తీవ్ర మానసిక శోభకు గురవుతున్నారు. మరికొందరు ఆ జోన్‌లో పనిచేయాలంటేనే భయపడిపోతున్నారు. సదరు డీసీపీ వచ్చారంటే.. విరుచుకుపడటం.. తిట్టుడే ఉంటుందని.. మేం కూడా మనుషులమేనంటూ.. సిబ్బంది తమ బాధలను తోటివారికి చెప్పుకొని.. కుమిలిపోతున్నారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా పారులకు పారదర్శకంగా సేవలు అందించాలన్న ధ్యేయంతో అధికారులు సిబ్బందికి సూచనలు, సలహాలు ఇవ్వడం.. సున్నితంగా మందలించడం సాధారణమే. ఇందులో కొన్ని సందర్భాల్లో విధి నిర్వహణలో నిర్లక్ష్యం, తప్పు చేశారన్న సమాచారం ఉన్నప్పుడు పై అధికారిగా సిబ్బందిని మందలించడం అప్పుడప్పుడు జరుగుతుంది. ఇలాంటి విషయాల్లో కిందిస్థాయి సిబ్బంది కూడా తప్పు చేశాం కాబట్టి.. మరోసారి ఆ తప్పు చేయవద్దనే తమ పై అధికారి మందలించారనే భావనలో ఉంటారు. అయితే సదరు జోన్ డీసీపీ పేరు ఎత్తితేనే ఆయన కింద పనిచేసే సిబ్బంది వణికిపోతున్నారు. పనిచేయించడంలో కఠినంగా ఉండటం మంచిదే..కానీ తమ కింద పనిచేసే వాళ్లు కదా అనే భావనతో ఇష్టానుసారంగా నోటికి వచ్చినట్లు మాట్లాడటం ఏమిటని సిబ్బంది వాపోతున్నారు.

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్

2న కలెక్టరేట్ల ముట్టడి

చిక్కడపల్లి, ఆగస్టు 29: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కులగణన వెంటనే ప్రారంభించాలని, లేని పక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. బీసీ సంక్షేమ సంఘం, బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో కులగణనను వెంటనే ప్రారంభించాలని, బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 2న జిల్లా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈమేరకు గురువారం కవాడిగూడలోని బీసీ భవన్‌లో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ గణేశాచారి, బీసీ కుల సంఘాల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ బాలగోని బాల్‌రాజ్ గౌడ్ తదితర నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు విక్రమ్ గౌడ్,మాదేశు రాజేందర్, కనకాల శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యువతిని చంపిన ప్రేమోన్మాది

అడ్డుకున్న మరో ముగ్గురికి తీవ్రగాయాలు

నిందితుడు సైతం కరెంటు తీగలను పట్టుకొని.. ఆత్మహత్యాయత్నం

గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన

దీప్నా తమాంగ్ (ఫైల్)

నిందితుడు రాకేశ్

శేరిలింగంపల్లి, ఆగస్టు 29: గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం చోటుచేసుకుంది. ప్రేమోన్మాది దాడిలో ఓ యువతి మృతి చెందగా, అడ్డుకున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. నిందితుడు సైతం విద్యుత్ తీగలను పట్టుకొని ఆత్మహత్యకు యత్నించి..ప్రాణపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం, కోచ్‌బీహార్ జిల్లా, లంకపార గ్రామానికి చెందిన దీప్నా తమాంగ్(26) గోపన్‌పల్లితండాలో మరో ముగ్గురు యువతులతో కలిసి అద్దెకుంటున్నది. ఓ బ్యుటిపార్లర్‌లో బ్యుటిషియన్‌గా పనిచేస్తున్నది. బెంగళూర్‌లో పనిచేసిన సమయంలో బీదర్‌కు చెందిన రాకేశ్(25)తో పరిచయం ఏర్పడింది. అతడు కూడా మాదాపూర్‌లోని హాస్టల్‌లో ఉంటూ.. మరో బ్యూటీపార్లర్‌లో పనిచేసేవాడు. ఇద్దరు మూడేండ్లుగా ప్రేమించుకుంటున్నారు. అయితే కొంతకాలంగా దీప్నా మరో వ్యక్తితో సన్నిహితంగా ఉంటున్నదనే కారణంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి గోపన్‌పల్లి తండాలోని దీప్నా తమాంగ్ నివసిస్తున్న ఇంటికి వచ్చిన రాకేశ్.. మాట్లాడాలంటూ.. బయటకు పిలిచాడు. అప్పటికే తన వెంట తెచ్చుకున్న కత్తితో దీప్నాతమాంగ్‌పై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. 15 కత్తిపోట్లకు గురైన దీప్నా.. రక్తపుమడుగులో పడిపోయింది. అరుపులు విని అడ్డుకునేందుకు యత్నించిన ఆమె స్నేహితులు సావిత్రి, పునీత, కృష్ణ తమాంగ్‌లపై సైతం రాకేశ్ దాడి చేసి.. పరారయ్యాడు. బాధితుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. దీప్నాతో పాటు ఆమె స్నేహితులను హాస్పటల్‌కు తరలించారు. అయితే అప్పటికే దీప్నా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దాడి అనంతరం రాకేశ్ బీదర్‌లో ఉంటున్న తన తల్లిదండ్రులకు ఇదే తన చివరి రోజు అంటూ మెసేజ్ పెట్టాడు. దీంతో రాకేశ్ తల్లిదండ్రులు కర్ణాటక పోలీసులను ఆశ్రయించారు. వారు ఇచ్చిన సమాచారంతో గచ్చిబౌలి పోలీసులు రాకేశ్ కోసం గాలించగా, మొయినాబాద్‌లో అతడి సెల్‌ఫోన్ సిగ్నళ్లను గుర్తించారు. అక్కడికి వెళ్లి చూసేసరికి విద్యుత్ తీగలను పట్టుకొని సగం కాలిన గాయాలతో రాకేశ్ కనిపించాడు. నిందితుడిని చికిత్స కోసం ఉస్మానియా దవాఖానకు తరలించిన పోలీసులు.. కేసు దర్యాప్తు చేపట్టారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ..

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం

మాదన్నపేట, ఆగస్టు 29 : దైవ దర్శనానికి వెళ్లొస్తూ..రోడ్డు ప్రమాదంలో నగరానికి చెందిన నలుగురు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్ మండలం అన్నాసాగర్ వద్ద చోటుచేసుకుంది. కుర్మగూడ డివిజన్ వాసులైన ఎనిమిది మంది మంగళవారం కారులో తిరుపతి వెళ్లారు. దైవదర్శనం అనంతరం తిరుగుప్రయాణమయ్యారు. ఈ క్రమంలో భూత్పూర్ వద్ద ఆగి ఉన్న లారీని వీరి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అశోక్‌యాదవ్, వెంకటరమణరావు, వెంకట్ యాదవ్, కెంపురావు యాదవ్ చనిపోగా, మిగతా నలుగురు సువర్ణ, అంబిక, గోవింద్ అక్షిత గాయపడ్డారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.

దూసుకొచ్చిన లారీ.. ఆరో తరగతి విద్యార్థిని మృతి

హబ్సిగూడలో ఘటన

కూతురిని పట్టుకుని రోదిస్తున్న తల్లి

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 29: హబ్సిగూడలో లారీ ఢీకొని ఆరో తరగతి విద్యార్థిని దుర్మరణం పాలైంది. ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తార్నాక డివిజన్ హనుమాన్ నగర్ స్ట్రీట్ నంబర్ 12లో నివాసముండే సంతోషి, నీల్‌కుమార్ దంపతుల పెద్ద కూతురు కామేశ్వరి (10) ఓ ప్రైవేటు స్కూల్‌లో ఆరో తరగతి చదువుతోంది. కుమారుడు వేదాంశ్ సైతం అదే పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. రోజులాగే మధ్యాహ్నం పాఠశాల నుంచి పిల్లలను తీసుకుని సంతోషి తన ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరారు. హబ్సిగూడలో వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో కిందపడిపోయారు. కామేశ్వరి కాళ్లపై నుంచి లారీ వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆస్పత్రికి తరలించగా, వైద్యులు అప్పటికే కామేశ్వరి చనిపోయిందని నిర్ధారించారు. లారీ డ్రైవర్ మియారామ్ జట్ (40)ను పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశంలో కూతురిని పట్టుకొని.. తల్లి కన్నీరుమున్నీరుగా విలపించడం చూపరులను కంటతడిపెట్టించింది.